క్లుప్తంగా

ఒంటిమిట్టలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరగడంతో ఆలయం వెనుక వైపు ఓంశాంతి అక్కయ్యల ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను కడప డీఎస్పీ ఎ. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట సీఐ బాబు, ఎస్‌ఐ శివప్రసాద్, అక్కయ్యలు గీతా, ప్రదీప, శిరీష, వారి పరివారం పాల్గొన్నారు.

రేపు నందలూరు మండల సర్వసభ్య సమావేశం

నందలూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, మండల ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల ఉన్నతాధికారులు హాజరు కావాలని కోరారు.

9న పెనగలూరులో..

పెనగలూరు : ఈనెల 9వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు జరగనుందని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా సీతాదేవి జయంతి వేడుక

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారిపల్లె గ్రామంలో వెలసిన రామాలయంలో శనివారం రాత్రి సీతాదేవి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. పురాణాలను అనుసరించి సీతా మహాదేవీ శ్రీరాముడికంటే వయస్సు రీత్యా పెద్దది అని ప్రతీతి. కాగా సీతాదేవి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకొని కూచివారిపల్లె గ్రామంలో రాములోరి ఉత్సవాలు ఒకరోజు ముందుగానే ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు గోపాల్ ఆధ్వర్యంలో మహిళలు సీతాదేవి ఉత్సవ మూర్తికి విశేషంగా పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా వెంకటరాజు

వీరబల్లి : సీతంపేట గ్రామానికి చెందిన సోమలరాజు వెంకటరాజును వీరబల్లి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి కేటాయించిన పదవికి న్యాయం చేకూరుస్తానన్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలుల బీభత్సానికి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కోరారు. దెబ్బతిన్న అరటితోటలను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులపై గర్భిణులకు అవగాహన

లక్కిరెడ్డిపల్లి : గర్భిణులకు సాధారణ ప్రసవాలు శ్రేయస్కరమని ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి, గైనకాలజిస్టు డాక్టర్ నీలోఫర్ బేగమ్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూలివీడు, దేవలంపల్లి, కోనంపేట, రామాపురం, పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, గర్భిణులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవాలు జరిగితే తల్లి శరీరం త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు సులోచన రెడ్డి, కీర్తి, నిసార్ అహ్మద్, జీవన్ కుమార్, భరత్, రెడ్డికృష్ణ, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట కళాకారుడికి రాష్ట్రస్థాయిలో ప్రశంస



గిరిధర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణం బోయపాళెంకు చెందిన ప్రముఖ చిత్రకారుడు నాయిని గిరిధర్ రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. ఈ విషయాన్ని ఆయన శనివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ తేజస్విని ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం హస్తకళ చిత్రలేఖన ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో తాను వేసిన చిత్రాలు ఆకర్షణగా నిలిచాయన్నారు. దీంతో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు గిరిధర్ తెలిపారు.

రారండోయ్.. రామయ్య పెళ్లికి..

- నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు
- ముస్తాబైన రాములోరి ఆలయాలు
- అంతటా నవమి వేడుకల సందడి



నారపురెడ్డిపల్లెలో ముస్తాబైన రాములోరి ఆలయం



రాములోరి ఆలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

రాజంపేట టౌన్ : సకల సద్గుణాలు కలిగి మానవాళికి ఆదర్శంగా, అపురూపమైన బంధాలకు ఆలవాలంగా నిలిచిన శ్రీరాముడు జన్మించిన శుభదినమే శ్రీరామనవమి. రామాలయం లేని గ్రామం ఉండదు అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో హిందువులు శ్రీరామనవమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకుంటారు. శ్రీరామనవమి వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నందున రామాలయాలు ముస్తాబయ్యాయి. ఎటుచూసినా శ్రీరామనవమి సందడి స్పష్టంగా కనిపిస్తోంది.

మానవ సంబంధాలను పెంచే నవమి వేడుకలు

ప్రస్తుతం కాలానుగుణంగా వచ్చిన మార్పులు, దీనికి తోడు అరచేతిలో కాలక్షేపానికి కొదవ లేకుండా చేస్తున్న సెల్‌ఫోన్ కారణంగా మనుషుల మధ్య మానవ సంబంధాలు, ఆత్మీయతలు దూరమవుతున్నాయి. ఒకప్పుడు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఏమాత్రం సమయం దొరికినా ఒకచోట చేరి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. అయితే శ్రీరామనవమి మాత్రం మనుషుల మధ్య పూర్వకాలం నాటి ఆత్మీయతను తీసుకొస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదనే చెప్పాలి. అనేక గ్రామాల్లో నవమి వేడుకలు ప్రారంభానికి పది రోజుల ముందు నుంచి గ్రామపెద్దలు, యువకులు, ప్రజలు సమావేశమై ఉత్సవాల నిర్వహణపై చర్చించేవారు. ఇక శ్రీరామనవమి పండుగకు ముందు మూడు, నాలుగు రోజుల నుంచి గ్రామాల్లోని ప్రజలు కలిసిమెలసి రాములోరి ఆలయాలను శోభాయమానంగా ముస్తాబు చేసే పనుల్లో నిమగ్నమవుతారు.

ఉభయాలతో సహపంక్తి భోజనం

శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు స్వామివారికి ఉభయాలు సమర్పిస్తారు. ఉభయం ఇచ్చేవారు గ్రామ ప్రజలకు, తమ బంధువులకు, మిత్రులకు భోజనాలను ఏర్పాటు చేస్తారు. ఈసందర్భంగా కులమతాలకు అతీతంగా, పేదలు, ధనవంతులు అన్న తేడా లేకుండా అందరు కలిసి ఒకేచోట భోజనం చేస్తారు. వంటలు తయారు చేసే సమయంలోను గ్రామస్తులు సరదాగా, సంతోషంగా మాట్లాడుకుంటూ రుచికరమైన వంటలను సిద్ధం చేస్తారు. అలాగే ప్రతినిత్యం సీతారామలక్ష్మణ విగ్రహాలను అలంకరించడం, రాత్రి వేళల్లో పూజలు చేయడం, భజనలు చేయడం అనంతరం ప్రసాదాలను సైతం ఒకచోట చేరి ఆరగిస్తారు. ఇవన్నీ కూడా మనుషుల మధ్య ఆత్మీయత, అనురాగాలను పెంపొందించేందుకు దోహదపడుతున్నాయి.

ఆరోగ్యానికి మేలు చేసే శ్రీరామనవమి వేడుకలు

శ్రీరామనవమి వేడుకలు మనిషి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శ్రీరామనవమిని హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఇతర మతాల వారు సైతం శ్రీరాముడి పట్ల హిందువులు చూపే భక్తిభావాన్ని గౌరవించి వారు సైతం ఉత్సవాలు జరిగినన్ని రోజులు మాంసాహారానికి దూరంగా ఉండేవారు కూడా ఉన్నారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఎనిమిది రోజుల పాటు తిరుమల–తిరుపతి దేవస్థానముల హిందుధర్మ ప్రచారపరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని హిందూ ధర్మప్రచారపరిషత్ సూపరింటెండెంట్ డిల్లీరెడ్డి, ప్రోగ్రాం అసిస్టెంట్ డాక్టర్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్టలో జరిగే కోదండరామ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా రాజంపేటలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం హరికథ, బుర్రకథ, నాటకాలు, కోలాటం, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కోదండ రామస్వామి ఆలయంలో నేడు కవి సమ్మేళనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి, పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో పోతన సాహితీ పీఠం వారు ఈనెల 6వ తేదిన పోతన భాగవతం అంశంపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని శనివారు పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో పోతన సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి విద్యాన్ ముమ్మడి నారాయణరెడ్డి రుక్మిణి సందేశం, మొల్ల సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి గానుగపెంట మనోజ్ కుమార్ రాజేంద్ర మోక్షం, భూతపురి సుబ్రహ్మణ్యం మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ భూతపురి గోపాలకృష్ణ కుచేలోపాఖ్యానం, సి.పి బ్రౌన్ గ్రంథాలయ బాధ్యులు డాక్టర్ జి. పార్వతి ప్రహ్లాద చరిత్ర, ఆచార్య సి.శివారెడ్డి వామన చరిత్ర, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ నీలవేణి రంతిదేవుని చరిత్ర అంశంపై ప్రసంగించనున్నారు.

పెద్దవీడు కొత్తపల్లిలో నేడు నవమి వేడుకలు

వీరబల్లి : మండలంలోని పెద్దవీడు పంచాయతీ కొత్తపల్లిలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. హాజరైన భక్తులకు అన్నప్రసాదాలు ఉంటాయన్నారు.

రాములోరి ఉత్సవాల ముందు చిన్నబోవాల్సిందే



శ్రీరామనవమి సందడైన వాతావరణాన్ని తీసుకొస్తుంది. మనిషికి వినోదాన్ని ఇచ్చే టీవీలు, ఎప్పుడు వెన్నంటి ఉండి కాలక్షేపాన్ని ఇచ్చే సెల్‌ఫోన్ సైతం రాములోరి ఉత్సవాల ముందు చిన్నబోవాల్సిందే. కాలం ఎంతమారినా శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా నెలకొనే సందడిలో మాత్రం మార్పు రాలేదంటే అందుకు కారణం శ్రీరాముడి ఆదర్శవంతమైన జీవితమే అని చెప్పాలి.

– ప్రసాద్‌రెడ్డి, ఆదర్శరైతు, హస్తవరం, రాజంపేట మండలం

రామాపురం మండలంలో..

రామాపురం : శ్రీరామనవమిని కనుల పండువగా నిర్వహించనున్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో ఉగాది నుంచి శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం రామాలయాలలో శ్రీ సీతారామలక్ష్మణ స్వాములకు ప్రభాతపూజ అభిషేకాలు, పూజలు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాములకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సుద్దమళ్ల గ్రామం ఎర్రమరెడ్డిగారిపల్లెలో కొలువైన శ్రీ కోదండ రామాలయంలో మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి దంపతులు కలిసి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కర్ణపువాండ్లపల్లెలో శ్రీ సీతారాములకు అభిషేకాలు, పూజలు, కల్యాణోత్సవం, గ్రామోత్సవం జరగనుంది. అలాగే ఇతర గ్రామాలలో నవమి వేడుకల సందర్భంగా చెక్కభజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.



కల్యాణోత్సవాలకు కొలువుతీదీరిన స్వాములు

పార్టీకి సేవలందించే వారికి తగిన గుర్తింపు

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధితో సేవలందించే వారిని పార్టీ అక్కున చేర్చుకొని అందలం ఎక్కిస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలుకూరి దయానందను ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఇందుకు సహకరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం దయానంద కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆకేపాటితో పాటు ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. ఎంప్లాయిస్, పెన్షనర్స్, దివ్యాంగులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, నరసారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్బరాజు, సుదర్శన్, కె.కృష్ణయ్య, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ విభిన్న ప్రతిభావంతుల నియోజకవర్గ అధ్యక్షుడు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీ నేతల భూ కబ్జాలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి

ఓబులవారిపల్లె : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు అడ్డూ అదుపు లేకుండా చేస్తున్న భూ కబ్జాలను అడ్డుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 976లో గల భూమిలో అడవుల నుంచి చెరువులకు పెద్ద కాలువ ద్వారా వర్షపునీరు వస్తుందన్నారు. కాకర్లవారిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు చంద్రయ్య నాయుడు కాలువను కబ్జాచేసి పూడ్చివేసి పొలంలోకి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేశారని ఆరోపించారు. అలాగే మంగంపేట ప్రధాన రహదారి పక్కన బొమ్మవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 45లో ఉన్న బస్టాండ్ స్థలాన్ని మంగళంపల్లికి చెందిన టీడీపీ నాయకుడు కబ్జా చేసి కంచె ఏర్పాటు చేశాడన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి భూ కబ్జాలను అడ్డుకోవాలని కోరారు.

రేస్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

గాలివీడు : రేస్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు విద్యాదీవెన కింద ఏటా విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచిన పదవ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 11 నుంచి మొదటి బ్యాచ్‌కు శిక్షణ ఇస్తారన్నారు. అలాగే మే 1 వ తేదీ నుంచి 6 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు మరో బ్యాచ్‌ను ప్రారంభిస్తామన్నారు. వివరాలకు 91000 67433 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

పెనగలూరు : పెనగలూరు పంచాయతీ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గణేష్ స్టీల్ అండ్ సిమెంట్ ప్రొప్రైటర్లు సుధాకర్, రమణ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవికాలం అంతా మజ్జిగను ప్రజలకు అందించనున్నట్లు వారు తెలిపారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా గల పలు ఆంజనేయస్వామి ఆలయాలలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.

ఐకమత్యంగా పండుగ జరుపుకోవాలి

నందలూరు : హిందూ ముస్లిం సోదరులు ఐకమత్యంగా ఉండి పండుగలు జరుపుకోవాలని ఇన్‌చార్జి ఎస్‌ఐ మోహన్ గౌడ్ పేర్కొన్నారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని నందలూరు గ్రామ పంచాయతీ బ్రాహ్మణ వీధిలోని హిందూ ముస్లింలతో శనివారం పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, భాస్కర్, ఎంపీటీసీ సుభాన్, కాంట్రాక్టర్ వెంకట సుబ్బయ్య, మండెం నాగరాజు, కె శ్రీహరి పాల్గొన్నారు.

మానవాళికి ఆదర్శనీయుడు శ్రీరామచంద్రుడు

రాయచోటి జగదాంబసెంటర్ : శ్రీ మహావిష్ణువు ఏడవ అవతారమైన శ్రీరాముడు మానవాళికి ఆదర్శనీయుడు అని రాష్ట్ర పీసీసీ జనరల్ సెక్రటరీ షేక అల్లాబక్ష్ అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

పెద్దిరెడ్డిని కలిసిన పుల్లంపేట కన్వీనర్

పుల్లంపేట : మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన స్వగృహంలో శనివారం పుల్లంపేట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముస్తాక్, సీనియర్ నాయకుడు కుమార్‌రెడ్డి కలిశారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడరాదని, అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తల్లెం భరత్ కుమార్ రెడ్డి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

చాందినీ బండ్లకు పోలీసుల అనుమతి తప్పనిసరి

సుండుపల్లె : మండల పరిధిలోని ప్రజలందరూ శ్రీరామనవమి పండుగ, సానిపాయి గ్రామ జాతర, తిరునాలలో స్వామి వారి ఊరేగింపుల సందర్భంగా చాందినీబండి కట్టేందుకు పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్

ఘనంగా జయంతి వేడుకలు



రాయచోటిలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రామాపురం : బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రామాంజనేయులు



పుల్లంపేట : దళవాయిపల్లి పాఠశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి



సుండుపల్లె : జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో నాయకులు




నందలూరు : జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



రాజంపేట టౌన్ : నివాళులు అర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు



లక్కిరెడ్డిపల్లె : బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్ : జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సిద్దవటం : బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ ఆనందరెడ్డి

రాయచోటి అర్బన్ : పీడిత, తాడిత, అణగారిన వర్గాల ప్రజల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు నాయకులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రకాలుగా వెనుకబడి కటిక దారిద్ర్యం అనుభవిస్తున్న నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ జీవితాంతం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొలిమి హారూన్ బాషా, రియాజుర్ రహిమాన్, జానం రవీంద్ర, సుగవాసి ఈశ్వర్, శ్యామ్‌కుమార్, బుజ్జిబాబు, సంజీవ, రియాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం మండలంలో..

రామాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పలు పాఠశాలల్లో శనివా బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులు పాల్గొన్నారు.

దళవాయిపల్లి పాఠశాలలో ..

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

బెటాలియన్‌లో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బెటాలియన్ కమాండెంట్ కె. ఆనందరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశ సేవకు అంకితమైన జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి. నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ పి.ఎస్.డి. ప్రసాద్, ఎం. థియోఫిలాస్, కె. వెంకట్‌రెడ్డి, బి. వెంకటశివుడు, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు ఏఆర్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో పని చేయాలి

నందలూరు : నేటితరం నేతలు బాబూ జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతురాజు మస్తానయ్య, మోడపోతుల రాములు, మైనార్టీ నాయకుడు సయ్యద్ అమీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, షేక్ మౌలా, మోహర్, కుబ్రమణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులకు ఘన నివాళి

రాజంపేట టౌన్ : మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్, ఉపాధ్యాయ ఉద్యమ నేత విజయరామరాజు వర్ధంతిని శనివారం ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక మన్నూరు హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ విజయరామరాజు ఉపాధ్యాయులే తన కుటుంబంగా భావించి అందరి మనస్సుల్లో చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. అలాగే జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మురళీమనోహర్, ఎం.ఓబులేసు, స్వామినాథన్, సత్యనారాయణ, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రఘువీరరాజు, శివ సుబ్రమణ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బహుజనుల ఆరాధ్యదైవం బాబు జగ్జీవన్ రామ్ అని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, మండల సర్వేయర్ రెడ్డి, ఆర్‌ఐ రాజేష్, వీఆర్‌ఓ పుష్పరాజ్, లక్కిరెడ్డిపల్లె గ్రామ సర్వేయర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, తల్లెం భరత్ కుమార్ రెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, శంకరయ్య, శివయ్య, రామకృష్ణ, రఘు, కరీముల్లా, అబ్దుల్ రౌఫ్, డి.రమణ, ఇనమాల మహేష్, నందా బాల తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షులు మహదేవ, బాలు, ఎంఎస్‌పీ గౌరవాధ్యక్షుడు పల్లం నాగేంద్ర, ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు

రాయచోటి టౌన్ : వెనుకబడిన వారి సమానత్వం కోసం ఎనలేని సేవ చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు అన్నారు. రాయచోటిలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం నిర్మూలన కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డి నరేష్, రాష్ట్ర కార్యదర్శి తేనెపల్లె గురుశంకర్ ప్రసాద్ మాదిగ, తిరుపతి దాము, రాయలసీమ అధ్యక్షుడు శ్రీనివాసులు, అన్నమయ్య అధ్యక్షుడు చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.